నిఘా లేక నిర్మాణాలు చకచకా

అనుమతికి మించి అంతస్తుల నిర్మాణం!



భగత్‌సింగ్ మార్గ్ రోడ్డులో..



చంద్రగిరినగర్ ప్రధాన రహదారిలో..



మగ్దూంనగర్ ప్రధాన రహదారిలో..

టౌన్‌ప్లానింగ్ అధికారుల నిఘా లేకపోవడంతో గాజులరామారం సర్కిల్ పరిధిలోని కాలనీల్లో అనుమతి లేని భవన నిర్మాణాలు విచ్చలవిడిగా చేపడుతున్నారు. ఎటువంటి అనుమతులు లేకుండా మూడు, నాలుగు అంతస్తుల భవనాలు నిర్మిస్తున్నారు. సంబంధిత అధికారులు వీరిపై చర్యలు తీసుకోవడంలో వెనకడుగు వేస్తున్నారు. చంద్రగిరినగర్, శ్రీనివాస్‌నగర్, మగ్దూం నగర్, భగత్‌సింగ్ మార్గ్, అంజయ్యనగర్, షిరిడీ హిల్స్‌లలో 100–150 గజాల స్థలాల్లో మూడు నాలుగు అంతస్తులు నిర్మిస్తున్నారు. వీటిపై సర్కిల్ టౌన్‌ప్లానింగ్ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు.ఇప్పటికైనా అధికారులు ఈ అనుమతి లేని భవనాలపై చర్యలు తీసుకోవాలని పలువురు అభిప్రాయపడుతున్నారు. – జగద్గిరిగుట్ట



శ్రీనివాస్‌నగర్ ప్రధాన రహదారిలో..

క్లుప్తంగా

ఘనంగా గ్రాడ్యుయేషన్ డే

రంగారెడ్డినగర్: చింతల్ నందానగర్‌లోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో సోమవారం యూకేజీ విద్యార్థుల గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన డైరెక్టర్ కేపీవిశాల్‌గౌడ్ నర్సరీ నుంచి 9వ తరగతి వరకు ప్రతిభ చూపిన విద్యార్థులకు సర్టిఫికెట్లను అందజేసి అభినందించారు. అనంతరం విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ నరేందర్‌రెడ్డి, ఎస్ఆర్ బాషా, ప్రిన్సిపాల్ మహేందర్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ వెంకటరెడ్డి, ఉపాధ్యాయులు భార్గవిరెడ్డి, భూలక్ష్మి, రమ్య, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాలల్లో వసతులు కరువు



సిబ్బందితో మాట్లాడుతున్న మల్లారెడ్డి

సుభాష్‌నగర్: ప్రభుత్వ కళాశాలల్లో సరైన వసతులు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని బీజేపీ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు మల్లారెడ్డి అన్నారు. సోమవారం బహదూర్‌పల్లి చౌరస్తాలో ఉన్న కుత్బుల్లాపూర్ ప్రభుత్వ జూనియర్ కాలేజీ, డిగ్రీ కాలేజీని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా తాగునీటి సదుపాయం లేక ఇబ్బందులు పడుతున్నామని తెలపడంతో వెంటనే ఫోన్‌లో సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కరించాలని కోరారు. రాష్ట్ర గిరిజన మోర్చా కార్యదర్శి రామారావు, గోనె మల్లారెడ్డి, కృష్ణారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, శ్రీనివాస్‌యాదవ్, విజయ్, శ్రీకాంత్ తదితరులు ఉన్నారు.

మృతుడిని గుర్తుపడితే జీడిమెట్ల ఠాణాలో సంప్రదించండి



జీడిమెట్ల: ఈ చిత్రంలో ఉన్న మృతి చెందిన వ్యక్తిని ఎవరైనా గుర్తుపడితే జీడిమెట్ల పోలీస్‌స్టేషన్‌లో తెలిపాలని పోలీసులు కోరారు. సదరు వ్యక్తి ఏప్రిల్ 8వ తేదీన సుభాష్‌నగర్‌లోని పెట్రోల్ బంక్ వద్ద మృతిచెందాడు. స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రి మార్చురీలో భద్రపరిచారు. మృతిచెందిన వ్యక్తి వయస్సు 50– 55 సంవత్సరాలు ఉంటుందని తెలిపారు. ఎవరైనా గుర్తిస్తే ఫోన్ నం.79011 25494, 94910 30151లో సంప్రదించాలని కోరారు.

దుండిగల్ ఓఆర్ఆర్‌పై లారీ, డీసీఎం ఢీ



ధ్వంసమైన డీసీఎం ముందు భాగం

దుండిగల్: దుండిగల్ ఓఆర్ఆర్ జంక్షన్ తాండా–1 ప్రధాన రోడ్డు వద్ద సోమవారం మధ్యాహ్నం లారీ, డీసీఎం లు ఢీకొన్నాయి. నర్సాపూర్ నుంచి గండిమైసమ్మ వైపు వెళ్తున్న డీసీఎం ముందు వెళ్తున్న లారీని ఢీకొట్టింది. ఈ ఘటనలో లారీ రోడ్డు పక్కన ఉన్న గుంతులో పడిపోగా డీసీఎం ముందు భాగం ధ్వంసమైంది. డీసీఎం డ్రైవర్‌తో పాటు గుంతలో పడిన లారీ డ్రైవర్లు గాయపడ్డారు. వీరిని దుండిగల్ పోలీసులు ఆస్పత్రికి తరలించారు. కాగా ఈ ఘటనకు సంబంధించి ఎలాంటి ఫిర్యాదు అందలేదని దుండిగల్ సీఐ రమణారెడ్డి తెలిపారు.

బీఆర్ఎస్ సభకు పెద్ద ఎత్తున తరలిరావాలి

నిజాంపేట్: బీఆర్ఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని పెద్ద ఎత్తున కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు నిజాంపేట్ మేయర్ కొలన్ నీలారెడ్డి ఓ ప్రకటనలో తెలియజేశారు. మంగళవారం ఉదయం 8గంటలకు బీఆర్ఎస్ కార్పొరేటర్లు, కో.ఆప్షన్ సభ్యులు, డివిజన్ల అధ్యక్షులు ఆయా డివిజన్లల్లో బీఆర్ఎస్ జెండాలను ఎగుర వేయాలన్నారు. అనంతరం కుత్బుల్లాపూర్ మున్సిపల్ గ్రౌండ్‌లో జరిగే పార్టీ ప్రజాప్రతినిధుల సభకు తరలి వెళ్లనున్నామని పేర్కొన్నారు. బీఆర్ఎస్ శ్రేణులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చి సభను జయప్రదం చేయాలని మేయర్ కోరారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు

నిజాంపేట్: ప్రగతినగర్‌లోని నారాయణ స్కూల్‌లో సోమవారం గ్రాడ్యుయేషన్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పాఠశాల ఏజీఎం వైజయంతి ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో సైతం పట్టు సాధించి తమ తల్లిదండ్రులకు, పాఠశాలకు మంచి పేరు తేవాలన్నారు. చదువుల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులతో పాటు ప్రశంస పత్రాలు అందజేశారు.

ఎంఎల్ఆర్ఐటీలో ‘హాస్టిల్ మానియా’



విద్యార్థులతో మాట్లాడుతున్న మర్రి రాజశేఖర్‌రెడ్డి

దుండిగల్: విద్యార్థులు వారి నైపుణ్యాలను పెంపొందించుకోవడంతో పాటు వర్ధమాన పారిశ్రామికవేత్తలుగా ఎదిగేందుకు ఎన్నో కార్యక్రమాలు చేపడుతున్నామని ఎంఎల్ఆర్ఐటీ కళాశాల సెక్రటరీ మర్రి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. దుండిగల్‌లోని కళాశాలలో సోమవారం సెంటర్ ఫర్ ఇన్నోవేషన్ అండ్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ విద్యార్థి కౌన్సిల్ సభ్యులు ‘హాస్టిల్ మానియా’అనే పేరుతో ఈవెంట్ నిర్వహించారు. ఈ సందర్భంగా మర్రి రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులు తమ నైపుణ్యాలను ఉపయోగించి రూపొందించే ఆవిష్కరణలను ప్రదర్శించడం కోసం ఇలాంటి వేదిక ఏర్పాటు చేయడం అభినందనీయన్నారు. భవిష్యత్‌లో మరిన్ని కార్యక్రమాలను నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ మర్రి లక్ష్మణ్‌రెడ్డి, ట్రెజరర్ మమతారెడ్డి, ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌రావు, ఈవెంట్ నిర్వాహకులు బలరాం, శుభాంగి రావు, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణలో పోలీస్ ముసుగులో గూండా రాజ్యం

జిల్లా వైఎస్సార్‌టీపీ అధ్యక్షుడు సురేష్‌రెడ్డి



కుత్బుల్లాపూర్: తెలంగాణలో పోలీస్ ముసుగులో గూండా రాజ్యం నడుస్తోందని వైఎస్సార్‌టీపీ మేడ్చల్–మల్కాజ్‌గిరి జిల్లా అధ్యక్షుడు సురేష్‌రెడ్డి అన్నారు. వైఎస్సార్‌టీపీ అధినేత్రి వైఎస్ షర్మిలను పోలీసులు అరెస్టు చేయడంపై సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో ఆయన మండిపడ్డారు. వైఎస్ షర్మిలను కనీసం వ్యక్తిగత పనులపై ఇంటి నుంచి బయటకు రానీయడం లేదన్నారు. తెలంగాణలో వైఎస్ షర్మిలకు రోజురోజుకు పెరుగుతున్న ఆదరణను చూసి సీఎం కేసీఆర్ భయపడుతున్నారని విమర్శించారు. పోలీసులు దుర్భాషలాడుతూ అరెస్టు చేయడం అత్యంత దారుణమని అన్నారు. మరోసారి వైఎస్ షర్మిలను అన్యాయంగా నిర్బంధిస్తే ఊరుకునేది లేదన్నారు. ప్రభుత్వం పోలీసులను రెచ్చగొట్టి అక్రమ కేసులు బనాయించి కోర్టులను తప్పుదోవ పట్టిస్తోందన్నారు. ఎన్ని నిర్బంధాలు చేసినా నిరుద్యోగులు, రైతు పక్షాన వైఎస్సార్‌టీపీ పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు.

‘కాలనీ అభివృద్ధికి నా సహకారం ఉంటుంది’



సాయిఅనురాగ్ కాలనీలో సమస్యలు తెలుసుకుంటున్న కార్పొరేటర్ వీరందర్‌రెడ్డి

నిజాంపేట్: కాలనీలు, బస్తీల్లో మౌలిక వసతులను మెరుగు పరుస్తున్నామని నిజాంపేట్ 18వ డివిజన్ కార్పొరేటర్ కొలన్ వీరేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆయన డివిజన్ పరిధిలోని సాయిఅనురాగ్ కాలనీ సేవా సమితి సభ్యులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా వైకుంఠధామం ప్రహరీ కూలిపోవడంతో దానిని మరలా పునర్ నిర్మించాలని స్థానికులు కార్పొరేటర్ దృష్టికి తీసుకురాగా ఆయన సానుకూలంగా స్పందించారు. ఈ సందర్భంగా వీరేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. కాలనీలో పెండింగ్‌లో ఉన్న డ్రైనేజీ, రోడ్ల పనులను త్వరలోనే ప్రారంభిస్తామన్నారు. కాలనీ అభివృద్ధికి తన వంతు సహాయ సహకారాలు ఎప్పుడూ ఉంటాయని పేర్కొన్నారు. కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధులు, సాయిఅనురాగ్ కాలనీ సేవాసమితి సభ్యులు ఉన్నారు.

ఔట్ సోర్సింగ్ కార్మికులకు వేతనాలు పెంచాలి



జలమండలి ఔట్‌సోర్సింగ్ కార్మికుల ఆందోళనకు మద్దతు తెలుపుతున్న బీజేపీ నేత భరతసింహారెడ్డి

రంగారెడ్డినగర్: ఔట్ సోర్సింగ్ కార్మికులకు వేతనాల పెంపుతో పాటు ఉద్యోగ భద్రత కల్పించాలని మేడ్చల్ అర్బన్ జిల్లా బీజేపీ కార్యదర్శి చెరుకుపల్లి భరతసింహారెడ్డి అన్నారు. రంగారెడ్డినగర్ డివిజన్ ఏపీహెచ్‌బీ కాలనీలోని జలమండలి కార్యాలయం ఎదుట సోమవారం మధ్యాహ్న భోజన విరామ సమయంలో ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు చేపట్టిన నిరసనకు ఆయన సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఔట్‌సోర్సింగ్ కార్మికులు మాట్లాడుతూ.. జీఓ. నం.11ను వెంటనే రద్దు చేసి జీవో 14ను అమలు చేయాలన్నారు. ప్రభుత్వం తమ డిమాండ్లను పరిష్కరించేంత వరకు నిరసనలు కొనసాగిస్తామని పేర్కొన్నారు. అనంతరం భరతసింహారెడ్డి మాట్లాడుతూ.. ఔట్‌సోర్సింగ్ కార్మికులు చేస్తున్న న్యాయబద్ధమైన ఆందోళనలకు బీజేపీ మద్దతు ఉంటుందన్నారు. ఈ నిరసనలో కృష్ణ, వినోద్, మల్లేష్, శివ, వాసు, సాయి, నవీన్, నిఖిల్, విపుల్, లక్ష్మణ్, నందుగౌడ్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

వెటర్నరీ వృత్తిపై అవగాహన



కుత్బుల్లాపూర్ జెడ్పీహెచ్ఎస్ విద్యార్థులకు వెటర్నరీ వృత్తిపై అవగాహన కల్పిస్తున్న వైద్యులు

కుత్బుల్లాపూర్: ఈనెల 29న వరల్డ్ వెటర్నరీ డేను పురస్కరించుకుని సోమవారం కుత్బుపూర్ జెడ్పీహెచ్ఎస్ స్కూల్‌లో విద్యార్థులకు వెటర్నరీ లెర్నింగ్ సెంటర్ డివిజన్ (వీఎంఎల్‌సీ) ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వెటర్నరీ వైద్యులు చంద్రశేఖర్, సౌజన్యప్రియ, యోగేష్ పాటిల్, బాగీష్ మిశ్రాలు పెంపు జంతుల ఆరోగ్య సంరక్షణకు వెటర్నరీ వైద్యులు అందిస్తున్న సేవలు వివరించారు. జంతువుల ద్వారా మనుషులకు సంక్రమించే వ్యాధుల పట్ల అవగాహన కల్పించారు. అదే విధంగా నిజజీవితంలో జంతువులు, పక్షుల వల్ల కలిగే ప్రయోజనాలను వివరిస్తూ వెటర్నరీ వృత్తిని చేపట్టాలని విద్యార్థులను ప్రోత్సహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు కేశవ్ సాయి, అనిల్ మురారీ, ఖాజాబాషా తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు



బహదూర్‌పల్లి 13 వార్డులో అనుమతికి మించి అంతస్తుల నిర్మాణం

సుభాష్‌నగర్: దుండిగల్ మున్సిపల్ బహదూర్‌పల్లిలో నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేపడుతూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారు. కొన్నిచోట్ల జీ–ప్లస్ అనుమతి తీసుకుని అదనంగా రెండు అంతస్తులు నిర్మిస్తున్నారు. మరికొన్ని చోట్ల అనుమతి లేకుండా అక్రమ సెల్లార్లు తవ్వి నిబంధనలు తుంగలో తొక్కి యథేచ్ఛగా నిర్మాణాలు చేపడుతున్నారు. ఇంత జరుగుతున్నా సంబంధిత దుండిగల్ టౌన్‌ప్లానింగ్ అధికారులు కేవలం నోటీసులతో సరిపెడుతున్నారు. 13వ వార్డు సర్వే నం.19లో పదుల సంఖ్యలో ఇలాంటి నిర్మాణాలు కొనసాగుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు.

చిన్నారుల ఆధార్ నమోదు షురూ



గిరినగర్ ప్రభుత్వ పాఠశాలలో ఆధార్ నమోదు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న అధికారులు

రంగారెడ్డినగర్: భవిష్యత్‌లో అన్నింటికి ఆధారే ఆధారమని ఐడీసీఎస్ రంగారెడ్డినగర్ సెక్టార్ సూపర్‌వైజర్ ఎస్.తిరుమల అన్నారు. స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కేంద్రాల నేతృత్వంలో 0–6 వయసు గల చిన్నారులకు ఆధార్ నమోదు కేంద్రాన్ని సోమవారం గిరినగర్‌లోని ప్రభుత్వ పాఠశాలలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తల్లిదండ్రులు తప్పనిసరిగా తమ చిన్నారులకు ఆధార్ నమోదు చేయించాలన్నారు. నమోదు కోసం వచ్చేవారు తమ ఆధార్‌తో పాటు విద్యుత్ బిల్లును తీసుకురావాలని సూచించారు. అంగన్‌వాడీ టీచర్లు నసీమా బేగం, ఎస్.నీరజ, కుమారి, వాణి, సునీత, పోస్టల్ శాఖ ఆధార్ ఎన్‌రోల్‌మెంట్ ప్రతినిధి కృష్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం



చిన్నారి ప్రణతి కుటుంబీకులకు ఆర్థిక సాయం అందజేస్తున్న కూన శ్రీనివాస్‌గౌడ్

కుత్బుల్లాపూర్: గుండె జబ్బుతో బాధపడుతున్న ఓ చిన్నారికి కూన కృష్ణ మహాలక్ష్మి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ శ్రీనివాస్‌గౌడ్ రూ.50వేల ఆర్థిక సహాయం చేసి వైద్య పరీక్షల్లో చేయిస్తున్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని రాజీవ్ గాంధీనగర్‌కు చెందిన సంతోష్‌కుమార్, మౌనిక దంపతుల కుమార్తె సి.ప్రణతి గతంలో రెండు సార్లు గుండెకు సర్జరీ జరిగింది. మరొక సర్జరీ చేయాలని డాక్టర్లు సూచించగా వారి ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా ఉండడంతో మాజీ ఎమ్మెల్యే, బీజేపీ నేత కూన శ్రీశైలంగౌడ్‌ను సంప్రదించారు. వైద్య పరీక్షల నిమిత్తం తమ తల్లిదండ్రుల పేరిట ఉన్న ట్రస్ట్ నుంచి రూ.50 వేలను సోమవారం ట్రస్ట్ చైర్మన్ కూన శ్రీనివాస్‌గౌడ్ చేతుల మీదుగా చిన్నారి తల్లిదండ్రులకు అందజేశారు. ఆపద సమయంలో ఆదుకునే దిశగా ప్రతి ఒక్కరూ ముందుకు రావాలన్నారు. తమ తల్లిదండ్రుల పేరిట ఏర్పాటు చేసిన ట్రస్టు ద్వారా ఎంతో మందికి లబ్ధి చేకూరేలా తమ సహకారాలు అందజేస్తున్నామని పేర్కొన్నారు.

22 మందికి కరోనా పరీక్షలు

అందరికీ నెగిటివ్

కుత్బుల్లాపూర్: జంట సర్కిళ్ల పరిధిలో కోవిడ్–19 నిర్ధారణ పరీక్షలు కొనసాగుతున్నాయి. సోమవారం సూరారం యూపీహెచ్‌సీలో 22 మందికి పరీక్షలు చేయగా అందరికి నెగిటివ్ రిపోర్టులు వచ్చినట్లు వైద్యాధికారులు తెలిపారు. దేశ వ్యాప్తంగా కోవిడ్ కేసులు పెరుగుతున్న నేపథ్యంలో అనుమానితులు వెంటనే పరీక్షలు చేయించుకుని జాగ్రత్త పడాలని అధికారులు సూచిస్తున్నారు.

మే 7న భగత్‌సింగ్‌నగర్ ఎన్నికలు

అదే రోజు సాయంత్రం కౌంటింగ్

చింతల్: చింతల్ డివిజన్ భగత్‌సింగ్ నగర్ నూతన కమిటీని ఎన్నుకోనున్నట్లు కాలనీ అడ్‌హక్ కమిటీ ఓ ప్రకటనలో తెలియజేసింది. అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి పదవులకు పోటీ చేసే వ్యక్తి స్థానికుడై ఉండాలన్నారు. ఆధార్, ఇంటి పన్ను రసీదు, రిజిస్ట్రేషన్ లేదా పట్టాల ఒరిజినల్స్‌ను చూపించి జిరాక్స్ కాపీలతో దరఖాస్తు చేసకోవాలన్నారు. ఈనెల 26న నామినేషన్ల దాఖలు, 28న ఉపసంహరణ, 29న ఉదయం 10 గంటలకు అభ్యర్థులకు గుర్తుల కేటాయింపు, 30వ తేదీ నుంచి అభ్యర్థుల ఎన్నిక ప్రచారం ఉంటుందన్నారు. మే 7వ తేదీన ఉదయం 7గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు ఓటింగ్ ప్రక్రియ కొనసాగుతుందన్నారు. అదేరోజు సాయంత్రం 5 గంటలకు ఓట్ల లెక్కింపు ఉంటుందన్నారు.

బీఆర్ఎస్ ప్రతినిధుల సభ ఏర్పాట్లు పూర్తి





కుత్బుల్లాపూర్ మున్సిపల్ గ్రౌండ్‌లో ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న ఎమ్మెల్యే వివేకానంద్

కుత్బుల్లాపూర్: నియోజకవర్గ స్థాయిలో నిర్వహించే బీఆర్ఎస్ ప్రతినిధుల సభ ఏర్పాట్లు పూర్తయ్యాయి. కుత్బుల్లాపూర్ మున్సిపల్ గ్రౌండ్‌లో మంగళవారం ఉదయం 10:30 నుంచి సాయంత్రం వరకు కొనసాగే ఈ సమావేశంలో పలు తీర్మానాలు చేసి గడిచిన తొమ్మిదేళ్లలో జరిగిన అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలపై దిశానిర్దేశం చేయనున్నారు. ఎమ్మెల్యే వివేకానంద, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజుతో పాటు పార్టీ ప్రతినిధులు హాజరవుతారని తెలిపారు. సోమవారం సభ ఏర్పాట్లను ఎమ్మెల్యే వివేకానంద్ పరిశీలించి పలు సూచనలు చేశారు. జీడిమెట్ల సీఐ పవన్‌తో కలిసి ఎలాంటి ట్రాఫిక్ సమస్య ఎదురుకాకుండా పార్కింగ్ ఏరియాతోపాటు భోజన సదుపాయాలు పర్యవేక్షించారు. ముఖ్యంగా తాగునీటి, విద్యుత్ రంగం విషయంపై ప్రధానంగా చర్చించనున్నట్లు ఎమ్మెల్యే వివేకానంద ‘సాక్షి’తో అన్నారు.

‘కంటివెలుగు’ను వినియోగించుకోవాలి



కంటి పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

దుండిగల్: కంటివెలుగును ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని దుండిగల్ మున్సిపల్ కమిషనర్ సత్యనారాయణ అన్నారు. దుండిగల్ మున్సిపాలిటీ మల్లంపేట గాజుల బస్తీలో నూతనంగా ఏర్పాటు చేసిన కంటివెలుగు కేంద్రాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ.. ప్రతి రోజు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పరీక్షలు నిర్వహిస్తారని పేర్కొన్నారు. అనంతరం ఉచితంగా కళ్లద్దాలను పంపిణీ చేస్తారని పేర్కొన్నారు. అనంతరం స్థానికంగా ఉన్న అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి అక్కడ గర్భిణులు, చిన్నారులకు అందిస్తున్న పౌష్టికాహారం గురించి ఆరా తీశారు. కార్యక్రమంలో వైస్‌చైర్మన్ పద్మారావు, కౌన్సిలర్లు శంభీపూర్ కృష్ణ, మాదాసు వెంకటేశం, ఎంబరి లక్ష్మి, స్థానిక నేతలు ఎంబరి ఆంజనేయులు, శామీర్‌పేట హన్మంత్‌రావు, రంగయ్య, మనోజ, బాలకృష్ణ, భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నూతన కమిటీ



శ్రీసీతారామచంద్ర విశాలాక్షి విశ్వేశ్వర ఆలయ నూతన కమిటీ సభ్యులు

కుత్బుల్లాపూర్: దూలపల్లిలోని శ్రీసీతారామచంద్ర, విశాలాక్షి విశ్వేశ్వర ఆలయ నూతన కమిటీని సోమవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బూర్గుబావి హన్మంతరావు, ఉపాధ్యక్షులుగా అందె యాదగిరి, బర్మా ప్రవీణ్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా గరిసె సతీష్, కార్యదర్శిగా పోశెట్టి నాగేష్, కోశాధికారిగా కదారి జితేందర్, సంయుక్త కార్యదర్శులుగా దొడ్ల మురళి, చెలిమెల శ్రీనివాస్, దుర్గం కుమార్, ప్రచార కార్యదర్శిగా బోగారం రాజు, చింతల రమేశ్ తదితరులు నియమితులయ్యారు.

సందడిగా చిన్నారుల క్రికెట్ టోర్నమెంట్



టోర్నమెంట్ అనంతరం విద్యార్థులతో ఉపాధ్యాయులు

జీడిమెట్ల: చిన్నారుల బుడి బుడి అడుగులతో క్రికెట్ ఆడుతూ అందరిని అబ్బుర పరిచారు. వారు బాల్ విసిరినపుడు, బ్యాట్‌తో బంతిని బౌండరీకి తరలించినపుడు విద్యార్థుల తల్లిదండ్రులు, వారికి విద్యాబుద్ధులు చెప్పే విద్యార్థులు మురిసిపోయారు. ఈ చిన్నారుల క్రికెట్ టోర్నమెంట్‌కు అపురూపాకాలనీలోని టీవీఆర్ పాఠశాల వేదికగా నిలిచింది. సోమవారం సాయంత్రం 4గంటల నుంచి 6గంటల వరకు చింతల్ వెంకటేశ్వరనగర్, సూరారం బచ్‌పన్ పాఠశాలల యూకేజీ విద్యార్థుల మధ్య క్రికెట్ పోటీ నిర్వహించారు. సందడిగా సాగిన క్రికెట్ టోర్నమెంట్‌ను టీవీఆర్ పాఠశాలల అకడమిక్ డైరెక్టర్ డా.రవి సూర ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. అనంతరం విద్యార్థులకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో సూరారం బచ్‌పన్ పాఠశాల డైరెక్టర్ వేణుమాధవ్, టీవీఆర్ పాఠశాల డైరెక్టర్ వంశీకృష్ణారెడ్డి ఉపాధ్యాయినులు పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.